సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం । 20 । మార్చి । 2024



అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు.



కల్యాణం.. కమనీయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి మంగళవారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది.

రంజాన్ వేళలు

పాడేరు, అరకు	
ఇఫ్తార్ (బుధ)	సహర్ (గురు)
6.12	4.46

రంపచోడవరం	
6.10	4.45

న్యూస్‌రీల్

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు రూరల్(హుకుంపేట): పాడేరు మండలం లగిసపల్లి కేజీబీవీలో 2024–2025 విద్యా సంవత్సరానికి 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎస్.చంద్రకళ మంగళవారం ఓ ప్రకటన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 6వ తరగతిలో 40 సీట్లు, 7వ తరగతిలో ఐదు, 8వ తరగతిలో నాలుగు, 9వ తరగతిలో రెండు, ఇంటర్మీడియెట్‌లో 40 సీట్లు భర్తీ చేయనున్నట్టు తెలిపారు. ఈ నెల 12వ తేదీ నుంచి ఏప్రిల్ 11వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

నేడు మోదకొండమ్మ ఉత్సవ కమిటీ ఎంపిక

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి జాతరకు సంబంధించి నూతన ఉత్సవ కమిటీని బుధవారం ఎంపిక చేయనున్నట్టు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మోదకొండమ్మతల్లి ఉత్సవాలను మే 19 నుంచి 21వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు నిర్ణయించినట్టు ఆయన పేర్కొన్నారు. ఈమేరకు ఆలయ ప్రాంగణంలో పాడేరు ఎమ్మెల్యే, ఆలయ కమిటీ చైర్‌పర్సన్ కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, గ్రామపెద్దలు, అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, వర్తక సంఘాల నేతల సమక్షంలో ఈ నూతన ఉత్సవ కమిటీని ఎంపికచేయనున్నట్టు ఆయన తెలిపారు.

టెన్త్ పరీక్ష కేంద్రాల తనిఖీ

చింతపల్లిరూరల్: మండల కేంద్రం చింతపల్లిలోని టెన్త్ పరీక్ష కేంద్రాలను గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు మంగళవారం తనిఖీ చేశారు. గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ బాలురు, బాలికల పాఠశాలల్లోని కేంద్రాలకు వెళ్లి విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించిన దీ,లేనిదీ తనిఖీ చేశారు.పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి పాల్గొన్నారు.

చట్టిలో రవాణాశాఖ చెక్‌పోస్ట్ మూసివేత

సాక్షి,పాడేరు: జిల్లాలోని చింతూరు మండలం చట్టి గ్రామంలో రవాణాశాఖకు చెందిన చెక్‌పోస్టును మూసివేసినట్టు జిల్లా రవాణాశాఖ అధికారి లీలాప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనదారులు పన్నులు, ఇతర పర్మిట్ సేవలను ఆన్‌లైన్ ద్వారా పొందాలని ఆయన కోరారు.

విశాఖ చేరుకున్న డీసీ ఆటగాళ్లు



గంగూలీ

గోపాలపట్నం(విశాఖ): ఐపీఎల్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్(డీసీ) జట్టుకు చెందిన పలువురు ఆటగాళ్లు మంగళవారం విశాఖ చేరుకున్నారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో డీసీ డైరెక్టర్ సౌరవ్ గంగూలీ, కెప్టెన్ డేవిడ్ వార్నర్‌తో పాటు మరో ఇద్దరు ఆటగాళ్లు వచ్చారు. వీరు రోడ్డు మార్గంలో రాడిసన్ బ్లూ హోటల్‌కు బయలుదేరి వెళ్లారు.

కోళ్లు, చేపల పెంపకం లాభదాయకం



సదస్సులో మాట్లాడుతున్న వీరాంజనేయులు

రంపచోడవరం: కోళ్లు, చేపల పెంపకం లాభదాయకమని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) మత్స్యశాఖ శాస్త్రవేత్త వీరాంజనేయులు తెలిపారు. కేవీకే ద్వారా విత్తన చేపపిల్లలను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కేవీకేలో మంగళవారం జాతీయ మత్స్య అభివృద్ధి మండలి ఆర్థిక సహకారంతో చేపలు, కోళ్ల పెంపకంపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఇచ్చే నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రాజెక్టు అగ్రి కల్చర్ అధికారి రాంబాబు మాట్లాడుతూ యువత, రైతులు మహిళా రైతులు మంచి యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని తెలిపారు. కేవీకే కోఆర్డినేటర్ లలితాకామేశ్వరి మాట్లాడుతూ ఒకే పంట వేసి నష్టపోవడం కంటే అన్ని రకాల పంటలు వేయడంతో పాటు పాడి, మత్స్య పరిశ్రమలను సమతుల్యంగా అభివృద్ధి చేసుకుంటే రైతులు ఆర్థికంగా లబ్ధి పొందుతారని తెలిపారు.కేవీకే శాస్త్రవేత్త క్రాంతికుమార్, చిరంజీవి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పక్కా ప్రణాళిక.. పటిష్ట పర్యవేక్షణ

- జిల్లాలో ఎనిమిది మానిటరింగ్ కేంద్రాల ఏర్పాటు
- ఎన్నికల ప్రచారాలపై పక్కా నిఘా
- ఒక్కో కేంద్రం నుంచి ఒక్కో అంశం పర్యవేక్షణ
- నేరుగా ఫిర్యాదులు చేసేందుకు ప్రత్యేక కేంద్రం ఏర్పాటు
- అభ్యర్థుల ఖర్చులను ఆరా తీసేందుకు ప్రత్యేక మానిటరింగ్ కేంద్రం





పాడేరులోని కలెక్టరేట్ సమావేశ హాల్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్

సాక్షి,పాడేరు: సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం పక్కాగా ఏర్పాట్లు చేసింది. ఫిర్యాదుల దగ్గర నుంచి అభ్యర్థుల ఖర్చు చేసే ప్రతి రూపాయి లెక్క పక్కాగా పర్యవేక్షించేలా మానిటరింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయ సునీత ఏర్పాటు చేశారు. ఆమె పర్యవేక్షణలో ఈ కేంద్రాలు పనిచేస్తున్నాయి. టీవీలు, పత్రికలే కాకుండా... సామాజిక మాధ్యమాలపైనా నిఘా ఉంచారు. పార్టీ అయినా.. అభ్యర్థి అయినా.. ఎన్నికల నియమావళి ఉల్లంఘించినట్టు గుర్తిస్తే.. సామాన్యుడు సైతం ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక సెల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎన్నికలకు సంబంధించి కలెక్టరేట్‌లో జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభించారు. ఎన్నికల కమిషన్ మార్గనిర్దేశకాల మేరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎనిమిది మానిటరింగ్ విభాగాలను ఏర్పాటు చేశారు. ఈ మానిటరింగ్ విభాగాలకు అధికారులను, సిబ్బందిని నియమించడంతో పాటు వారికి ఎన్నికల విధులు,ఎన్నికల నియమావళిపై సమగ్ర శిక్షణ ఇచ్చారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యేంతవరకు వారంతా ఈ విధుల్లో ఉంటారు.

ఇందుకోసం ఏర్పాటు చేసిన వివిధ ప్రత్యేక కేంద్రాల వివరాల్ని పరిశీలిద్దాం...

మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ మానిటరింగ్ విభాగం

- ఎవరు పర్యవేక్షిస్తారు : డ్వామా పీడీ ఎ.శివయ్య (ఫోన్ 63050 12615)
- సిబ్బంది : ముగ్గురు
- ఏం చేస్తారు : ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే అన్ని అంశాలపై ఫిర్యాదులను స్వీకరించడంతో పాటు జిల్లా వ్యాప్తంగా కోడ్ ఉల్లంఘనలపై సమగ్ర నివేదికలు అందజేస్తారు.

1950 కాల్ సెంటర్

- ఎవరు పర్యవేక్షిస్తారు : వెటర్నరీ అసిస్టెంట్ అరమనాగేశ్వరరావు(ఫోన్ 85000 13304)
- సిబ్బంది : ముగ్గురు
- ఏం చేస్తారు : 1950 కాల్‌సెంటర్‌కు వచ్చిన ప్రతి ఫోన్‌కాల్‌ను స్వీకరించి ఆయా ఫిర్యాదులను జిల్లా ఎన్నికల అధికారికి ఎప్పటికప్పుడు నివేదిస్తారు.

కమ్యూనికేషన్ మానిటరింగ్ విభాగం

- ఎవరు పర్యవేక్షిస్తారు : జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎ.రమేష్ (ఫోన్ 90008 90789)
- నోడల్ అధికారులు : ముగ్గురు
- ఏం చేస్తారు : ఎన్నికలకు సంబంధించిన ప్రతి సమాచారం రాజకీయ పార్టీలు, ప్రజలకు తెలియజేస్తారు.

పక్కాగా ఎన్నికల నియమావళి అమలు



ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో ఎన్నికల నియమావళిని పక్కాగా అమలుజేస్తాం. కలెక్టరేట్‌లో జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించాం.పలు విభాగాలకు సంబంధించి ఎనిమిది మానిటరింగ్ విభాగాలను ఏర్పాటు చేశాం.సమర్థులైన అధికారులు, సిబ్బంది ఈవిభాగాల్లో నియమితులయ్యారు. వారంతా 24గంటల పాటు ఎన్నికల విధుల్లో ఉంటారు.

– ఎం.విజయసునీత, కలెక్టర్

మీడియా మానిటరింగ్ సెంటర్

- ఎవరు పర్యవేక్షిస్తారు : సమాచార,పౌరసంబంధాలశాఖ అధికారి పి.గోవిందరాజులు (ఫోన్ 91212 15268)
- నోడల్ అధికారులు : ముగ్గురు
- ఏం చేస్తారు : పత్రికలు, టీవీల్లో వచ్చే ఎన్నికల వార్తలతో పాటు వ్యతిరేక వార్తలను ట్రాక్ చేసి నివేదికలు తయారు చేస్తారు. ఏవైనా తప్పుడు వార్తలు ప్రచురిస్తే.. వాటికి సంబంధించిన వాస్తవాలతో కూడిన ప్రెస్‌నోట్ విడుదల చేస్తారు. రాజకీయ పార్టీల ప్రకటనలకు సంబంధించిన వివరాలను, ఫిర్యాదులను ఎన్నికల సంఘానికి పంపిస్తారు.

సోషల్ మీడియా మానిటరింగ్ విభాగం

- ఎవరు పర్యవేక్షిస్తారు : సమాచారశాఖ డివిజనల్ పీఆర్‌వో పి.రాములు(ఫోన్94408 03568)
- సిబ్బంది : ముగ్గురు
- ఏం చేస్తారు : సోషల్ మీడియాలో రాజకీయ పార్టీల నేతలు,అభ్యర్థులపై వచ్చిన తప్పుడు పోస్టులు,అసత్య ప్రచారాలు,ఇతర అంశాలను క్షుణంగా పరిశీలించి, తగిన సమగ్ర నివేదికలు అందిస్తారు.

సీ–విజిల్ మానిటరింగ్ విభాగం

- ఎవరు పర్యవేక్షిస్తారు : పాడేరు ఎంపీడీవో కె.సాయినవీన్ (ఫోన్ నంబర్ 63033 41224)
- నోడల్ అధికారులు : నలుగురు
- ఏం చేస్తారు : ఎన్నికల నిర్వహణపై ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా(ఈసీఐ) రూపొందించిన సీ–విజిల్(సిటిజన్ విజిలెన్స్) యాప్ ద్వారా పౌరులు ఫిర్యాదు చేయవచ్చు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, పార్టీల ఖర్చులకు సంబంధించిన ఫిర్యాదుల్ని ఈ యాప్ ద్వారా ఫొటోలు, వీడియోల రూపంలో అప్‌లోడ్ చేసి, ఫిర్యాదు చేస్తారు. ఇందులో ఫిర్యాదు చేసిన 100 నిమిషాల్లో ఈ సీవిజిల్ కంట్రోల్ రూమ్ సిబ్బంది విచారణ చేపట్టి నివేదికను ఎన్నికల అధికారులకు అందిస్తారు.

కమాండ్ కంట్రోల్ సెంటర్

- ఎక్కడ : కలెక్టరేట్ సమావేశ మందిరం
- ఎవరు పర్యవేక్షిస్తారు: కలెక్టర్

ఫిర్యాదుల మానిటరింగ్ విభాగం

- ఎవరు పర్యవేక్షిస్తారు : జిల్లా కోఆపరేటివ్ అధికారి మల్ల వెంకట రామకృష్ణరాజు (ఫోన్ 91549 89444)
- సిబ్బంది : ముగ్గురు
- ఏం చేస్తారు: ఎన్నికలకు సంబంధించిన అన్ని ఫిర్యాదులను తీసుకుని జిల్లా ఎన్నికల అధికారికి నివేదిస్తారు.

ఖర్చుల మానిటరింగ్ విభాగం

- ఎవరు పర్యవేక్షిస్తారు : పాడేరు డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్.కుమార్(ఫోన్ 98482 38886)
- సిబ్బంది : ముగ్గురు
- ఏం చేస్తారు: పార్టీలు, అభ్యర్థులు చేస్తున్న ఖర్చుల వివరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. అభ్యర్థులు తాము చేసిన ఖర్చుల నివేదికలను ఈ కార్యాలయానికి అందజేయాలి.

పకడ్బందీగా కోడ్ అమలు

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశం



రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో సమావేశానికి హాజరైన జేసీ భావన వశిష్ట్,డీఆర్వో పద్మావతి

సాక్షి,పాడేరు: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మోడల్ ఆఫ్ కోడ్ కాండక్ట్‌ను పక్కాగా అమలుకు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్‌మీనా ఆదేశించారు. ఆయన మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రంపచోదరం నుంచి కలెక్టర్ ఎం.విజయసునీత, పాడేరు కలెక్టరేట్ నుంచి జేసీ భావన వశిష్ట్, డీఆర్వో పద్మావతి, నోడల్ అధికారులు గోవిందరాజులు,డీఎల్‌పీవో పి.ఎస్.కుమార్,ఉద్యానవనశాఖ అధికారి రమేష్ కుమార్‌రావు పాల్గొన్నారు.జిల్లాలో ఎన్నికల నియమావళి అమలు, ఎన్నికల ఏర్పాట్లను సీఈవోకు వారంతా వివరించారు.

కొత్త ఓటర్లకు ఎపిక్ కార్డుల జారీ



ఓటరు గుర్తింపు కార్డుల విభజన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఆర్వో పద్మావతి

సాక్షి,పాడేరు: జిల్లాలో కొత్త ఓటర్లకు ఎన్నికల కమిషన్ ఓటరు గుర్తింపు(ఎపిక్) కార్డులు జారీ చేసింది. పాడేరు, రంపచోడవరం, అరకులోయ నియోజకవర్గాల్లో 2వ విడతలో 76,149 మందికి ఈ కార్డులు వచ్చాయి. వాటిని ఓటర్లకు పంపిణీ చేసేందుకు రెవెన్యూ యంత్రాంగం చర్యలు తీసుకుంది. ఎపిక్ కార్డులను కలెక్టరేట్‌లో రెవెన్యూ సిబ్బంది స్కాన్ చేసి, పోలింగ్ బూత్‌ల వారీగా విభజిస్తున్నారు. ఈ పనులను మంగళవారం డీఆర్వో పద్మావతి పరిశీలించారు. ఎపిక్ కార్డుల పంపిణీని వేగవంతం చేయాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీటీ భవానీ, ఎంపీడీవో పూర్ణయ్య, నోడల్ అధికారి గోవిందరాజులు పాల్గొన్నారు.



కొత్త ఓటరు గుర్తింపు కార్డులు

పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు



బరడలో పోలింగ్ కేంద్రంలో సౌకర్యాలపై ఆరా తీస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్



రంపచోదవరంలో నిర్వహించిన సమావేశంలో పీవోలు, సబ్ కలెక్టర్

ముంచంగిపుట్టు: పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు పాడేరు ఐటీడీఏ పీవో, అరకు రిటర్నింగ్ అధికారి వి.అభిషేక్ సూచించారు. మండలంలో లక్ష్మీపురం, బరడ, కించాయిపుట్టు, ఏనుగురాయి, మాకవరం, వనుగుమ్మ, రంగబయలు బుంగాపుట్టు, బంగారుమెట్ట పంచాయతీల్లో ఉన్న 15 పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. కల్పించాల్సిన సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నిచర్ తదితర అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సక్రమంగా అమలు చేయాలని, ఎవరు అతిక్రమించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికలు విజయవంతం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ఎన్నికల ప్రక్రియ సక్రమంగా జరిగేందుకు కలిసికట్టుగా పని చేయాలన్నారు. అనంతరం లక్ష్మీపురం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను పీవో పరిశీలించారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించి, గర్భిణులకు మంచి పౌష్టికాహారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రఫీజాన్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో ఏర్పాట్లు

రంపచోడవరం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తిస్థాయిలో చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే, రంపచోడవరం సబ్ కలెక్టర్, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎస్.ప్రశాంత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి చాంబర్‌లో చింతూరు ఐటీడీఏ పీవో చైతన్యతో కలిసి ఎన్నికల అధికారులతో ఈవీఎంలు, స్ట్రాంగ్ రూముపై సమావేశం నిర్వహించారు. ఆర్‌వో ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గంలో 399 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలను స్ట్రాంగ్ రూములో భద్రపరిచేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలన్నారు.

తహసీల్దార్లు, డీటీలు ఎన్నికలకు సంబంధించిన నివేదికలు ఎప్పటికప్పుడు సమర్పించాలని ఆదేశించారు. వాహనాల పార్కింగ్, ఎన్నికల అధికారులకు, సిబ్బందికి భోజన సదుపాయాలపై చర్చించారు. ఈ సమావేశంలో సర్వే ఇన్‌స్పెక్టర్ కె.దేవేంద్రుడు, తహసీల్దార్ ఎ.కృష్ణజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

చందనోత్సవం బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన



చందనోత్సవం ఏర్పాట్లపై దేవస్థానం ఈవోతో చర్చిస్తున్న సీపీ రవిశంకర్

సింహాచలం: సింహాచల క్షేత్రంలో మే 10న జరిగే చందనోత్సవంలో పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై మంగళవారం విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ దేవస్థానం అధికారులు, పోలీస్ అధికారులతో కలిసి ముందస్తు పరిశీలన చేశారు. కొండదిగువ, సింహగిరిపై పర్యటించి సంబంధిత ప్రణాళికపై చర్చించారు. చందనోత్సవం రోజు ఉచిత దర్శనంతోపాటు ప్రత్యేక దర్శన క్యూలు ఎక్కడెక్కడి నుంచి ఏర్పాటు చేస్తున్నారో దేవస్థానం అధికారుల నుంచి తెలుసుకున్నారు.

చందనోత్సవం నిర్వహణకు సంబంధించి ఇటీవల దేవదాయశాఖ కమిషనర్ ప్రతిపాదించిన పలు అంశాలను కూడా దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి సీపీ దృష్టికి తీసుకెళ్లారు. దీని ప్రకారం భక్తులకు అంతరాలయ దర్శనాల రద్దు, ఘాట్‌రోడ్డులో మినీ బస్సులు నడిపే ప్రక్రియ, క్యూల వద్ద పోలీస్ బందోబస్తు, టికెట్లు రీసేల్ లేకుండా చూడటం తదితర అంశాలపై చర్చ సాగింది. ముఖ్యంగా కొండదిగువ అడివివరం నుంచి పాత గోశాల మార్గంలో బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న దృష్ట్యా.. ఆ మార్గంలో రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టే చర్యలపై చర్చించారు. సంయుక్త సీపీ ఫకీరప్ప, డీసీపీ–2 ఎం.సత్తిబాబు, ట్రాఫిక్ ఏడీసీపీ జి.శ్రీనివాసరావు, నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, స్పెషల్ బ్రాంచ్ ఏడీసీపీ వెంకట్రావు, సింహాచల ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్, దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, ఏఈ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బూదరాళ్ల–చాపరాతిపాలెం రహదారిపై
రాకపోకలు వద్దు

- రాజకీయ నాయకులు, అధికారులకు సూచన
- మావోయిస్టులు విధ్వంసాలకు పాల్పడే అవకాశం ఉందని భావిస్తున్న పోలీసులు



బూదరాళ్ల–చాపరాతిపాలెం రహదారి

కొయ్యూరు: మావోయిస్టుల నుంచి ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో బూదరాళ్ల–చాపరాతిపాలెం రహదారిలో ఈ మూడు నెలలు రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు ప్రయాణించకూడదని పోలీసు శాఖ సూచించింది. ఒకప్పుడు ఈ ప్రాంతం మావోయిస్టులకు కంచుకోటగా ఉండేది. తరువాత వారి ప్రభావం తగ్గుముఖం పట్టింది. అయితే ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టులు ఎలాంటి విధ్వంసానికైనా పాల్పడే అవకాశం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. అందువల్ల ఈ రహదారిలో ప్రయాణాలు చేయవద్దని సూచిస్తున్నారు. రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు ఈ రహదారిలో ప్రయాణించవలసి వస్తే ముందుగా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. పాడేరు, చింతపల్లి నుంచి కొయ్యూరు రావాలంటే జిల్లా అధికారులు, రాజకీయ నాయకులు ఈ రహదారిపై ప్రయాణిస్తారు. దూరం తక్కువగా ఉండడంతో ఈ రహదారిపైనే రాకపోకలు సాగిస్తారు. గత కలెక్టర్ సుమిత్ కుమార్ ఈ మార్గం ద్వారా రాజవొమ్మంగి,రంపచోడవరం వెళ్లేవారు. జిల్లా అధికారులు సైతం ఇదే మార్గాన్ని ఎంచుకుంటారు. ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టులు విధ్వంసానికి పాల్పడే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. 1992లో ఇదే దారిలో అప్పటి ఎమ్మెల్యే పసుపులేటి బాలరాజును మావోయిస్టులు కిడ్నాప్ చేసి నెల తరువాత విడిచిపెట్టారు. బూదరాళ్ల రహదారిపై రాకపోకలు సాగించవద్దని అధికారులు, నాయకులకు సూచించినట్టు సీఐ వెంకటరమణ, ఎస్‌ఐ లోకేష్‌కుమార్ తెలిపారు. ఇది మావోయిస్టు ప్రభావితం ప్రాంతం కావడంతో నేతలకు ముందు జాగ్రత్తగా హెచ్చరిస్తున్నట్టు వారు తెలిపారు. పూర్తిస్థాయిలో నిఘా ఉంచామని చెప్పారు.

సీలేరులో విద్యుత్ ఉత్పత్తి పునః ప్రారంభం

గోదావరిలోకి రోజుకు 3,500 క్యూసెక్కుల నీరు విడుదల



సీలేరు జలవిద్యుత్ కేంద్రం

సీలేరు: ఏపీజెన్‌కో సీలేరు విద్యుత్ కాంప్లెక్స్‌లో మంగళవారం నుంచి విద్యుత్‌ను పునఃప్రారంభించారు. బలిమెల నుంచి రోజుకు 2,000 క్యూసెక్కుల నీటిని తీసుకుని సీలేరులో రెండు యూనిట్ల ద్వారా 0.2 మిలియన్ల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. కాంప్లెక్స్ మొత్తంలో రోజుకు 3 మిలియన్ల నుంచి 4 మిలియన్ల వరకు ఉత్పత్తి చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి అనంతరంగోదావరి డెల్టాకు రోజుకు 3,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మరో 500 క్యూసెక్కుల నీరు అదనంగా అవసరమవుతుందని ఇరిగేషన్ శాఖ తెలియజేసినట్టు జెన్‌కో వర్గాలు చెప్పాయి.

మాచ్‌ఖండ్‌లో గణనీయంగా తగ్గిన విద్యుత్ ఉత్పత్తి

ముంచంగిపుట్టు: ఆంధ్ర,ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్‌కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. ఆరు జనరేటర్లు ఉన్న విద్యుత్ కేంద్రంలో ఇప్పటికే మూడు జనరేటర్లు పనిచేయడం లేదు. డుడుమ,జోలాపుట్టు జలాశయాలలో నీటి కొరతతో మంగళవారం సాయంత్రం 3వ నంబర్ జనరేటర్ ద్వారా జరిగే విద్యుత్ ఉత్పత్తిని నిలిపి వేసినట్టు మాచ్‌ఖండ్ ఎస్‌ఈ సుబ్రమణ్యేశ్వరరావు తెలిపారు. జలాశయాలలో నీరు లేకపోవడం వల్ల క్రమేపి విద్యుత్ ఉత్పత్తిని నిలిపి వేస్తూ వస్తున్నామని, గతంలో నాలుగు నంబర్‌ను జనరేటర్‌ను నిలిపివేశామని చెప్పారు. ప్రస్తుతం 1వ నంబర్ జనరేటర్ మాత్రమే వినియోగంలో ఉందని దాని ద్వారా 17 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతోందని, నీటి నిలువ ఉన్నంత వరకు విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని ఆయన తెలిపారు.

నాలాంటోళ్లకు అండ జగన్



నా పేరు ఉమ్మిడి అమ్మోరమ్మ. నేను మత్స్యకార కుటుంబానికి చెందిన మహిళను. మంగమారిపేటలో నివాసం ఉంటున్నాను. నా భర్త ఉమ్మిడి ఎల్లయ్య తొమ్మిదేళ్ల కిందట చనిపోయారు. నాకు ఎల్మాజీ, ఆదిలక్ష్మి, అరుణ ముగ్గురు ఆడ పిల్లలు. ఆయన చనిపోయిన తర్వాత కుటుంబ నిర్వహణ భారం పడింది. కూలి పనులు చేసుకుని.. ముగ్గురు ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేశాను. ప్రస్తుతం నేను నా తమ్ముడు ఇంట్లో ఉంటున్నాను. ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ రూ.3వేలు నా నెల ఖర్చుకు సరిపోతోంది. చిన్న చిన్న పనులు చేసుకుంటూ నా శేష జీవితాన్ని సంతోషంగా గడుపుతున్నాను. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పింఛన్ కోసం మాకు దూరంగా ఉన్న కె. నగరపాలెం పంచాయతీ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. జగన్‌బాబు వచ్చిన తర్వాత వలంటీర్లు ఇంటికే వచ్చి పింఛన్ ఇస్తున్నారు. కొడుకులా ఆదుకుంటూ ప్రతి నెలా రూ.3 వేలు ఇస్తుండటంతో.. మూడు పూటలా కడుపు నిండా తింటున్నా. నాలాంటి వాళ్లకు అండగా ఉంటున్న జగన్ చల్లగా ఉండాలి.

జగన్ మేలు గొప్పది



నా పేరు దళాయి ఈశ్వరమ్మ. జీవీఎంసీ 35వ వార్డు చినదుర్గాలమ్మ వీధిలో ఉంటున్నా. నేను 70 రూపాయల నుంచి పింఛన్ అందుకుంటున్నా. గతంలో ఏనాడూ ఇంటికి తీసుకువచ్చి పింఛన్ ఇచ్చిన దాఖలాలు లేవు. మా వీధిలోని గణేశ్వర పాఠశాల వద్ద గానీ.. పండావీధిలో అంగన్‌వాడీ కేంద్రం దగ్గరకు గానీ రమ్మనేవారు. అది కూడా నెలలో 10వ తేదీ నాటికి కబురు వచ్చేది. ఆ రోజు పింఛన్లు ఇస్తున్నామని అంటే.. ఎండలో వెళ్లేవాళ్లం. ఒక్కొక్కసారి సాయంత్రానికి అధికారి వచ్చి పింఛన్ ఇచ్చేవారు. కొన్నిసార్లు డబ్బులు రాలేదని, మళ్లీ రండి అని పంపించేవారు. కానీ ఇప్పుడు ఎక్కడికీ వెళ్లడం లేదు. ఇంటి దగ్గర ఉంటే చాలు.. సూర్యుడు ఉదయించకమునుపే వలంటీర్లు డబ్బులు అందిస్తున్నారు. ఇప్పుడు రూ.3వేలు తీసుకుంటున్నాను. నా ఖర్చులకు సరిపోతున్నాయి. మా ఆయుష్షు కూడా పోసుకుని జగన్ నిండు నూరేళ్లు జీవించాలి.

జగనన్నే నా దేవుడు



నా పేరు రాజ్యలక్ష్మి, దివ్యాంగురాలైన పేద కుటుంబానికి చెందిన నేను ఎటపాక మండలం గౌరీదేవిపేటలో అమ్మమ్మ వద్ద ఉంటున్నాను. భగవంతుడు నా శరీరానికి వైకల్యాన్నిచ్చినా.. దాన్ని అధిగమించేలా మా జగనన్న ఆనందాన్ని, ధైర్యాన్ని ఇచ్చాడు. ప్రతినెల మొదటిరోజునే వలంటీరు ఇంటికి వచ్చి పింఛను ఇస్తుంటే నాకు అండగా ఈ ప్రభుత్వం ఉందనిపిస్తుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ కోసం నా కుటుంబ సభ్యులు నన్ను మోసుకెళ్లేందుకు చాలా ఇబ్బందులు పడేవారు. రోడ్డు ప్రమాదంలో నాన్న మతిస్థిమితం కోల్పోవడంతో అమ్మ కూలి పనిచేస్తూ తమ్ముడిని, నాన్నని పోషిస్తోంది. అమ్మ తెచ్చే కూలి డబ్బులు సరిపడక పోవడంతో నేను అదే ఊరిలో అమ్మమ్మ దగ్గర ఉంటున్నాను. నా బాగోగులు అమ్మమ్మే చూస్తోంది. నా లాంటి వారిని అన్ని విధాలుగా ఆదుకుంటూ ఆసరా నిలుస్తున్న జగనన్నే నా దేవుడు.

పింఛన్‌తో సాఫీగా జీవనం



నా పేరు దొర చిన్నమ్మి. నా భర్త ఐదేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. నాకు పిల్లలు లేరు. నేను పాడేరు మండలంలోని లోచలిపుట్టు వీధిలో జీవనం సాగిస్తున్నాను. కూలికి వెళ్తే కానీ పూట గడవని పరిస్థితి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ కోసం పంచాయతీ కార్యాలయం వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది. పింఛన్ కోసం నానా అవస్థలు పడ్డాను. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి నెల ఒకటో తేదీన ఇంటి వద్దే గ్రామ వలంటీర్ వచ్చి పింఛన్ అందజేస్తున్నారు. రేషన్ సరకులు సైతం ఇంటి వద్దకే అందుతున్నాయి. ఏ ఆసరా లేని నాలాంటి వారికి జగనన్న ప్రభుత్వం అందజేస్తున్న పింఛన్ సొమ్ము ఎంతో ఉపయోగపడుతోంది. ఈ సొమ్ముతో సాఫీగా జీవనం సాగుతోంది.

జన్మభూమి కమిటీ.. చంద్రబాబు పాలనలో ఈ పేరు వింటేనే ప్రతీ పెన్షన్ లబ్ధిదారుడు వణికిపోయే పరిస్థితి ఉండేది. పండుటాకులను రాబందుల్లా పీక్కుతింటూ పింఛన్‌దారులకు చుక్కలు చూపించేవి. అంతేనా.. నెల నెలా పెన్షన్ డబ్బులు తీసుకోవాలంటే నడవలేని, నిలబడలేని స్థితిలో కూడా చాంతాడంత క్యూల్లో.. ఎర్రటి ఎండలో గంటల తరబడి నిరీక్షించిన రోజులు మరిచిపోగలమా? పైగా.. చంద్రబాబు పాలనలో అన్నీ అర్హతలున్న వాళ్లు పెన్షన్ కావాలంటే ఏడాదికో, లేదంటే రెండేళ్ల కోసారో మొక్కుబడిగా ప్రభుత్వం నిర్వహించే జన్మభూమి కార్యక్రమంలోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉండేది. పింఛన్ తీసుకుంటున్న వారు ఎవరైనా మరణిస్తేనో లేదా ఇతర కారణాలతో తగ్గితేనే కొత్త పెన్షన్లు మంజూరయ్యేవి. అలాంటి పరిస్థితుల్లో.. పింఛన్లు అందక విలవిల్లాడే దుస్థితిలో ఉన్న అవ్వాతాతలకు అండగా నిలుస్తూ.. వారి మోముల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చిరునవ్వులు నింపింది. అవ్వాతాతలు, దివ్యాంగులు సహా ఇతర సామాజిక భద్రతా పెన్షన్ లబ్ధిదారులందరికీ రామరాజ్యమంటే ఏంటో.. సంక్షేమ శకం తీపిగుర్తులు ఎలా ఉంటాయో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూపించారు. వలంటీర్ల వ్యవస్థతో ఇంటికే పింఛను అందిస్తూ.. వారికి కొండంత భరోసానిచ్చారు.


– సాక్షి, విశాఖపట్నం/కొమ్మాది/సింథియా/ఎటపాక/ పాడేరు

వైఎస్ జగన్ హామీతో హడావిడిగా..

ప్రజా సంకల్పయాత్రలో భాగంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన నవరత్నాల్లో పింఛన్ పెంపు హామీని కాపీ కొట్టిన చంద్రబాబు 2019 జనవరి నుంచి పెన్షన్లు పెంపుదల చేశారు. కొత్త పెన్షన్లు మంజూరు చేసిన ప్రతీసారి ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ.500 నుంచి రూ.1000 వరకు తెలుగు తమ్ముళ్లు మామూళ్లు దండుకున్నారు. ఈ విధంగా దాదాపు జిల్లా వ్యాప్తంగా రూ.15 కోట్లకు పైగా వసూళ్ల దందా సాగించారు.

నాడు కత్తెర.. నేడు జాతరలా
ఆనందమానందమాయె..

- చంద్రబాబు హయాంలో పింఛనుదారుల బాధలు వర్ణనాతీతం
- రాబందుల్లా పీక్కుతిన్న జన్మభూమి కమిటీలు
- కుంటిసాకులు చెబుతూ వృద్ధుల పింఛన్లకు కత్తెర
- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మారిన చిత్రం
- ప్రస్తుతం రూ.3 వేలు వరకు పింఛన్ అందజేత



ముఖ్యమంత్రిగా చంద్రబాబు వెలగబెట్టిన తొమ్మిదేళ్లలో ఏనాడూ అవ్వా తాతలను పట్టించుకున్న పాపాన పోలేదు. ఆ రోజుల్లో పింఛన్ రూ.75 ఇచ్చే వారు. ఏ గ్రామంలోనైనా ఎవరైనా చనిపోతే తప్ప కొత్తగా ఒక్క పింఛన్ కూడా మంజూరు చేసేవారు కాదు. మహానేత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజా ప్రస్థానం పాదయాత్రలో అవ్వాతాతలు పడుతున్న బాధలను చూసి చలించి పోయారు. 2004లో అధికారంలోకి వచ్చీ రాగానే పింఛన్‌ను ఒకేసారి రూ.200కు పెంచారు. అంతేకాదు సంతృప్తికర పద్ధతిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఫించన్లు మంజూరు చేశారు. ఆయన హయాంలో మంజూరైనన్ని పెన్షన్లు.. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ మంజూరవలేదన్నది చరిత్ర చెబుతోంది. 2014లో టీడీపీ అధికారంలోకి రాగానే జన్మభూమి కమిటీల పేరిట... ఉన్న పింఛన్లకు చంద్రబాబు కోత పెట్టారు. పెద్ద ఎత్తున వడపోతలు మీద వడపోతలు చేస్తూ దాదాపు 30 వేలకు పైగా పింఛన్లను తీసేశారు చంద్రబాబు.



ఆ రోజుల్లో పచ్చ చొక్కాలదే హవా

టీడీపీ అధికారంలోకి రాక ముందు జిల్లాలో 3.28 లక్షల పింఛన్లుండేవి. జన్మభూమి కమిటీల పరిశీలన పేరిట 15 వేలకు పైగా పింఛన్లను తొలగించి ఆ తర్వాత రోల్‌బ్యాక్ అంటూ వాటిని పునరుద్ధరిస్తున్నట్టు ప్రకటించి తమకు నచ్చిన వారికి మంజూరు చేశారు. ఆ తర్వాత కొత్త పింఛన్ల పేరిట 2014 నుంచి 2019 వరకు 90 వేల పింఛన్లు మంజూరు చేశారు. వీటిలో 90 శాతం జన్మభూమి కమిటీ సిఫార్సులతో పూర్తిగా టీడీపీ నేతలు, కార్యకర్తలకే కేటాయించారు. ఇళ్లు, పొలాలు, ఆస్తులున్న వారికి సైతం పింఛన్లు అందజేసేవారు. అన్ని అర్హతలున్న వారిని పక్కన పెట్టేశారు. పైగా ప్రతి నెలా ఆధార్ లింక్ కాలేదని, వేలి ముద్రలు పడలేదని, ఐరిస్ క్యాప్చర్ కాలేదనే సాకుతో 10 నుంచి 15 శాతం మంది పింఛన్‌దారులకు మొండిచేయి చూపించారు. 2018 డిసెంబర్ వరకు పింఛన్ల కోసం అప్పటి ప్రభుత్వం జిల్లాకు నెలకు రూ.48 కోట్ల వరకు విడుదల చేసింది.

టీడీపీ హయాంలో ఉమ్మడి విశాఖలో మొత్తం పింఛన్లు	
అర్బన్ ప్రాంతం	1,16,789
గ్రామీణ,ఏజెన్సీ ప్రాంతం	3,05,546
మొత్తం పింఛన్ల సంఖ్య	4,22,335
ప్రతి నెలా ఇచ్చిన మొత్తం	రూ.75.83 కోట్లు
2019 తర్వాత.. వైఎస్సార్ సీపీ హయాంలో..	
ఉమ్మడి విశాఖలో మొత్తం పింఛన్లు	5,61,336
ప్రతి నెలా అందిస్తున్న మొత్తం	రూ.166.82 కోట్లు
విశాఖ జిల్లాలో మొత్తం పింఛన్లు	1,65,891
ప్రతి నెలా అందిస్తున్న మొత్తం	రూ.50.11 కోట్లు
అనకాపల్లి జిల్లాలో మొత్తం పింఛన్లు	2,67,097
ప్రతి నెలా అందిస్తున్న మొత్తం	రూ.77.78 కోట్లు
అల్లూరి జిల్లాలో మొత్తం పింఛన్లు	1,28,348
ప్రతి నెలా అందిస్తున్న మొత్తం	రూ.38.93 కోట్లు

బాబు కుట్రను ముందే పసిగట్టిన జగన్

'జగనన్న వస్తున్నాడు... నవరత్నాలు తెస్తున్నాడు...'అంటూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే ప్రస్తుతం ఇస్తున్న రూ.1000 పింఛన్ మొత్తాన్ని రూ.2 వేలకు పెంచుతామని గుంటూరు వేదికగా జరిగిన పార్టీ ప్లీనరీలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఈ హామీపై ప్రజా సంకల్పయాత్రలో విస్తృత ప్రచారం చేస్తూనే కడప జిల్లా పర్యటనలో ఆయనో మాట చెప్పారు. ఆ దేవుడు ఆశీర్వదించి..మీ అందరి చల్లని దీవెనలతో మనందరి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అవ్వాతాతలకు పింఛన్ రూ.2 వేలు చేస్తానని చెప్పారు. జగన్ చెప్పాడు కదా అని చంద్రబాబు ఎన్నికల ముందు రూ.2వేలు చేసినా ఆశ్చర్య పోనక్కర్లేదు. చేస్తే చేయనీయండి. ఫర్వాలేదు. అవ్వాతాతలకు ఎంత చేసినా తక్కువే. మన ప్రభుత్వం రాగానే ఆ రూ.2వేలను రూ.3వేలకు పెంచుకుంటూ పోతా.. అని హామీ ఇచ్చారు. జననేత ఊహించినట్టుగానే 2019 ఎన్నికలకు 3 నెలలు ఉండగా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఓ పక్క ఆర్థిక లోటంటూనే పింఛన్ మొత్తాన్ని రూ.2 వేలు పెంచుతూ ప్రకటన చేసి... ఫిబ్రవరి నుంచి అమల్లోకి తీసుకొచ్చారు. ఇందుకోసం చంద్రన్న వరాల పండగ పేరిట ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో మూడు రోజుల పాటు హంగామా చేశారు. పెంచిన పింఛన్ పంపిణీలో కూడా టీడీపీ నేతలు చేతివాటం ప్రదర్శించడం మానలేదు. ఒక్కో పింఛన్‌దారుడి నుంచి రూ.500 వరకు వసూళ్లకు పాల్పడ్డారు.

సీఎం జగన్ పాలనలో.. సంతృప్త స్థాయిలో..

వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే పింఛనుదారులకు కష్టాలన్నీ దూరమయ్యాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థతో లబ్ధిదారులు చిరునవ్వుతో ఇంటి వద్దనే పింఛను తీసుకుంటున్నారు. చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీలు చెప్పిన చోటుకి వెళ్లి పింఛను తీసుకునేవారు. ఎండలో.. లైన్లలో నిలబడితే.. ఒకటో తేదీ నుంచి పంచడం మొదలు పెట్టేవారు. 15వ తేదీ వచ్చినా కొందరికి పింఛను అందేది కాదు. కానీ వైఎస్సార్‌సీపీ హయాంలో.. ఒకటో తేదీనే ఇంటికొచ్చి మరీ వలంటీరు పింఛను అందిస్తున్నారు. దీంతో.. అవ్వాతాతలే కాదు.. ఒంటరి మహిళలు, దివ్యాంగులు, డయాలసిస్ రోగులు.. ఇలా ప్రతి ఒక్కరికీ గుమ్మం వద్దే పింఛన్లు అందుతున్నాయి. 2019 నాటికి ఉమ్మడి విశాఖ జిల్లాలో అన్ని వర్గాల పింఛనుదారులు 4.22 లక్షల మంది ఉన్నారు. 2019 జనవరి వరకు కేవలం రూ.48 కోట్లను మాత్రమే ప్రభుత్వం కేటాయించేది. జనవరి తర్వాత మూడు నెలల పాటు రూ 2 వేలు ఇచ్చిన టీడీపీ ప్రభుత్వం.. ప్రతి నెలా రూ.75.83 కోట్లు చెల్లించేది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత.. కుల, మత, ప్రాంత, రాజకీయాలకతీతంగా.. ఎటువంటి లంచాలు లేకుండా పింఛన్ అందిస్తోంది. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు అనర్హులైన వారికి పింఛన్లు అందించాయి. ఇలాంటి 10 వేల మందికిపైగా గుర్తించి.. వారి పింఛన్లు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రద్దు చేసింది. వారి బదులుగా.. పూర్తి అర్హతలున్న వారికి పింఛన్లు మంజూరు చేసింది. ప్రస్తుతం పింఛన్‌దారులకు రూ.3 వేల చొప్పున అందుతోంది.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి, భార్యకు గాయాలు

రాజవొమ్మంగి: మండలంలోని శరభవరం గ్రామ శివారున మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వణకరాయికి చెందిన లోతా తమ్మారావు(45) మరణించాడు. భార్య అనసూయ(36)కు గాయాలయ్యాయి. వివరాలు.. తమ్మారావు తన భార్యతో కలిసి గ్రామశివారునున్న వారి జీడిమామిడి తోటకు మోటారు బైక్‌పై వెళ్లారు. పనులు ముగించుకుని ఇంటి ముఖం పట్టారు. తోటలో నుంచి రోడ్డుపైకి వస్తుండగా బైక్ అదుపు తప్పడంతో ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు. అదే సమయంలో వెనుక నుంచి లోడుతో వస్తున్న టిప్పర్ లారీ టైర్ తమ్మారావుపైకి ఎక్కడంతో ఎడమ కాలు ఫ్రాక్చర్ అయ్యింది. స్థానికులు రాజవొమ్మంగి పీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం 108లో భార్యాభర్తలను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. మార్గమధ్యలో తమ్మారావు మరణించడంతో ఆ గిరిజన కుటుంబంలో విషాదం అలముకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలేశ్వరంలోని సీహెచ్‌సీలో ఉంచారు. మృతునికి ముగ్గురు ఆడపిల్లలున్నారు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.



లోతా తమ్మారావు మృతదేహం



తమ్మారావు(ఫైల్)

గిరిజనుడు దారుణ హత్య

మారేడుమిల్లి: మండలంలోని వేటుకూరు పంచాయతీ పందిరిమామిడికోట గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో గిరిజనుడు దారుణ హత్యకు గురయ్యాడు. బంధువులు, స్థానికుల కథనం మేరకు.. సోమవారం పందిరిమామిడికోట గ్రామానికి సమీప అడవిలో గ్రామస్తులందరూ మామిడి కొత్త పండగ ఘనంగా నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన కదల చితుకు రెడ్డి (50) పండగలో ఉత్సాహంగా పాల్గొన్నాడు. అనంతరం రాత్రి ఇంటి వద్ద భోజనం చేసి గ్రామానికి సమీపంలోని గొర్రమెట్ట కొండ వద్ద తన కొండపోడు చేను పాక వద్ద నిద్రించాడు. మంగళవారం తెల్లవారుజామున బంధువులు అక్కడకు వెళ్లి చూసేసరికి నిద్రించిన చోటే రక్తపు మడుగులో మృతి చెంది ఉన్నాడు. తల, మెడపై కత్తి గాట్లు ఉన్నాయి. సమాచారం మేరకు పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనుమానంతో సమీప బంధువును ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు, కుమార్తె ఉన్నారు.



చితుకు రెడ్డి మృతదేహం



చితుకు రెడ్డి(ఫైల్)

సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన అవసరం

దేవీపట్నం: దేవీపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి ముర్తజా వలి ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బందికి హెల్త్ ఎడ్యుకేటర్ పి.ఝాన్సీ రాణి సికిల్‌సెల్ వ్యాధిపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజన గ్రామాల్లోని సికిల్ సెల్ వ్యాధి పట్ల అవగాహన , టెస్టులు చేయించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సికిల్ సెల్ నివారణ కోసం తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నాయని తెలిపారు. తల్లిదండ్రుల నుంచి పిల్లలకు ఈ సికిల్ సెల్ వ్యాధి వ్యాప్తి చెందే అవకాశాలు ఎక్కువని చెప్పారు. రక్త కణాలు సంఖ్య తగ్గటం అలసట రావడం కళ్లు పసుపు రంగులోకి మారడం తరచుగా వచ్చే అంటు వ్యాధులు తీవ్రమైన ఒళ్ళు నొప్పులు కీళ్ల నొప్పులు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అవయవం నష్టం ,గర్భధారణ సమయంలో సమస్యలు రావచ్చన్నారు. మంచి నీటిని ఎక్కువ తాగాలని సూచించారు.



అవగాహన కల్పిస్తున్న ఝాన్సీ

ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలు

- కిలగాడ ఘాట్ వద్ద ప్రమాదం.. ఒకరి పరిస్థితి విషమం
- పీవో అభిషేక్ చొరవతో క్షతగాత్రులు ఆస్పత్రికి తరలింపు

ముంచంగిపుట్టు: మండలంలోని కిలగాడ ఘాట్ వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని లక్ష్మీపురం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కొర్రా అర్జున్ తన స్వగ్రామం డుంబ్రిగుడ మండలం గుంటసీమకు మంగళవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఆ సమయంలో పెదబయలు మండలం సీకరి పంచాయతీ అరిమెర గ్రామానికి చెందిన కిల్లో సీతారాం, ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా చట్వా పంచాయతీ మండిపోదర్ గ్రామానికి చెందిన జి.పరమేష్‌లు ద్విచక్ర వాహనంపై ముంచంగిపుట్టు వస్తున్నారు. కిలగాడ ఘాట్ వద్దకు వచ్చేసరికి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. దీంతో ముగ్గురికీ తీవ్ర గాయాలు అయ్యాయి. ఆ మార్గంలో పాడేరు వెళ్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్ క్షతగాత్రుల పరిస్థితి చూసి వెంటనే అంబులెన్స్ రప్పించి, ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలించే ఏర్పాట్లు చేశారు. ఫోన్‌లో వైద్యులతో మాట్లాడి ప్రమాద బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించి, పరిస్థితి తనకు తెలపాలని సూచించారు. క్షతగాత్రులకు వైద్యాధికారులు గీతాంజలి, సంతోష్, రమేష్‌లు వైద్య సేవలు అందించారు. హిందీ ఉపాధ్యాయుడు అర్జున్‌కు తలపై తీవ్ర గాయం కావడంతో పరిస్థితి విషమంగా మారింది. దీంతో మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, వైస్ ఎంపీపీ భాగ్యవతి, వైఎస్సార్‌సీపీ నేతలు పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను సూచించారు. ఈ సంఘటనపై ఉపాధ్యాయుడి భార్య సరోజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్‌ఐ రవీంద్ర కేసు నమోదు చేశారు.



కిలగాడ వద్ద ద్విచక్ర వాహన ప్రమాదంలో పడి ఉన్న క్షతగాత్రులు



క్షత్రగాత్రులను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

సురక్షితంగా బాలిక అప్పగింత

అడ్డతీగల: మండలంలోని వెదుళ్లకొండ గ్రామానికి చెందిన కుంజం చరిష్మా(8) సురక్షితంగా ఆమె తల్లి చెంతకు చేరింది. అడ్డతీగల సీఐ ఆర్.రవికుమార్ వివరాల ప్రకారం.. తరచూ టీవీ చూస్తున్నావని తల్లి విశ్వమ్మ మందలించడంతో సోమవారం బాలిక ఇల్లు విడిచి వెళ్లిపోయింది. దాంతో బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆచూకీ కోసం దుశ్చర్తి ఎస్‌ఐ లతాశ్రీ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం సదరు బాలిక తన ఇంటి సమీపంలోని మరో ఇంటి మరుగుదొడ్డిలో దాక్కొని ఉండడం గమనించి బయటకు తీసుకొచ్చి కౌన్సెలింగ్ చేసి తల్లికి అప్పగించారు. ఎస్‌ఐ లతాశ్రీ పాల్గొన్నారు.



బాలిక చరిష్మాను ఆమె తల్లికి అప్పగిస్తున్న సీఐ రవికుమార్, ఎస్‌ఐ లతాశ్రీ

అటవీ ప్రాంతంలో చుక్కల జింక కళేబరం

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి అటవీక్షేత్రం సూరంపాలెం అడవుల్లో మరణించిన చుక్కల జింక (దుప్పి) గ్రామస్తులకు కనిపించింది. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. జింక కళేబరాన్ని అధికారులు అతి ప్రయాశతో పోస్టుమార్టం నిమిత్తం ప్రధాన రహదారికి తరలించారు. జింక మరణించి రెండు రోజులు అయి ఉంటుందని స్థానిక ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ రాము చెప్పారు. ఇది ఆడ జింక అని, 3 సంవత్సరాల వయస్సు ఉంటుందని పేర్కొన్నారు. మెడపై లోతైన గాయాలు ఉన్నాయన్నారు. కుక్కలు వెంట పడి దాడి చేయడం వల్లనే మరణించి ఉండవచ్చని అటవీ అధికారులు చెబుతున్నారు.



సూరంపాలెం అడవిలో లభించిన చుక్కల జింక కళేబరం